ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1 సిద్దిపేట
బుధవారం 5 జూన్ 2024


ఎన్నికల కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న రఘునందన్‌రావు



విజయసంకేతం చూపుతున్న రఘునందన్‌రావు

39,139 ఓట్ల మెజార్టీతో విజయం

గులాబీ తోటలో విరిసిన కమలం

తొలిసారి ఎంపీగా రఘునందన్‌రావు గెలుపు

- రసవత్తరంగా తొలి ఐదు రౌండ్ల లెక్కింపు
- ఆ తర్వాతే బీజేపీకి స్పష్టమైన ఆధిక్యం
- అనూహ్యంగా కాంగ్రెస్‌కు రెండోస్థానం
- మూడోస్థానంతో సరిపెట్టుకున్న బీఆర్‌ఎస్
- ఇరవై సంవత్సరాల తర్వాత మెదక్‌లో మార్పు
- ఆరునెలల్లోనే బీఆర్‌ఎస్‌కు ప్రతికూల తీర్పు
- బీజేపీ, కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్లు
- అందరి అంచనాలు తలకిందులు!!



గులాబీ పార్టీకి కంచుకోటగా పేరున్న మెదక్‌లోక్‌సభలో బీజేపీ పాగా వేసింది. తాజా ఫలితాల్లో ఆ పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎంపీగా విజయం సాధించారు. ఈ సీటు బీఆర్‌ఎస్ ఖాతాలో చేరుతుందని అంతా భావించారు. కానీ అనూహ్య రీతిలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఇక్కడ 'కమలం' వికసించింది. పైగా బీఆర్‌ఎస్ పార్టీకి మూడోస్థానం దక్కడం గమనార్హం. కాంగ్రెస్ రెండోస్థానానికి ఎగబాకింది. తొలి పదిరౌండ్లలో ఫలితాలు స్వల్ప తేడాలతో ఉత్కంఠను రేకెత్తించగా.. ఆ తర్వాత బీజేపీకి స్పష్టమైన ఆధిక్యాన్ని ఇచ్చాయి. 2004 నుండి 2019 పార్లమెంటు ఎన్నికల వరకు తిరుగులేని విజయాలను సొంతం చేసుకున్న గులాబీ శ్రేణులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇరవై ఏళ్ల ఆధిపత్యానికి ఎట్టకేలకు బ్రేక్ పడింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి,సిద్దిపేట, జూన్ 4

రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరిగినా అందరిచూపు మాత్రం మెదక్ సెగ్మెంటు వైపే ఉందంటే అతిశయోక్తి కాదు. అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్‌కు చావోరేవో అన్నట్లుగా మారిన ఈ ఎన్నికల్లో కొన్ని స్థానాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. అందులో మెదక్ మొదటిది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యేలుగా ఉన్న గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాలు ఈ లోక్‌సభ పరిధిలోనే ఉన్నాయి. పైగా ప్రచారం నుంచి ఎగ్జిట్‌పోల్స్ వరకు బీఆర్‌ఎస్‌కు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నా మెదక్‌లో విజయం దక్కుతుందనే ధీమా ఉండేది. కానీ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపొందడమే కాకుండా బీఆర్‌ఎస్ మూడోస్థానానికి పడిపోయింది.

ఉత్కంఠ నుంచి ఆధిక్యం దాకా..

మెదక్ లోక్‌సభ ఫలితాలపై ఆది నుండి ఉత్కంఠ నెలకొంది. ఇందుకు తగినట్లుగానే మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైంది. తొలి రౌండ్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి 1542 ఓట్ల ఆధిక్యం రాగా, 2వ రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 355 ఓట్లు వచ్చాయి. 3వ రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 1731 ఓట్ల ఆధిక్యం దక్కడంతో ఫలితాలు రసవత్తరంగా మారాయి. ఆ తర్వాత 4, 5 రౌండ్లలో బీఆర్‌ఎస్ ఆధిక్యం కనబర్చగా 6వ రౌండ్‌లో మళ్లీ బీజేపీ ముందంజ వేసింది. ఇక 7వ రౌండ్ నుంచి రఘునందన్‌రావు ఆధిక్యం పెరుగుతూ వెళ్లింది. అయితే మూడోస్థానంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు రౌండ్‌రౌండ్‌కూ తన ఓట్లను పెంచుకుంటూ రెండోస్థానానికి చేరారు. చివరగా 23 రౌండ్లు ముగిసేదాకా బీజేపీకి ఎదురులేకుండా పోయింది. నువ్వానేనా అన్నట్లుగా ఉన్న బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కు బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి నడుమ 74వేల ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 39వేల ఓట్ల తేడా రావడంతో ఇక బీజేపీకి లైన్‌క్లియర్ అయ్యింది.

మెదక్‌లో రెండోసారి బీజేపీ

మెదక్ లోక్‌సభకు సంబంధించి ఇప్పటివరకు 19 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 9 సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. వీరిలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సైతం ఉన్నారు. ఇక పీడీఎఫ్, టీడీపీ, టీపీఎస్ పార్టీల అభ్యర్థులు ఒక్కోసారి గెలుపొందారు. ఐదుసార్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులకు విజయం దక్కింది. ఇందులో మాజీ సీఎం, ఆ పార్టీ అధినేత కేసీఆర్ కూడా ఉన్నారు. అయితే 1999లో బీజేపీ తరఫున ఆలె నరేంద్ర బరిలోకి దిగి విజయం సాధించారు. ఆ తర్వాత ప్రతీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులు పోటీలో నిలుస్తున్నప్పటికీ ప్రభావం చూపించలేకపోయారు. తాజా ఎన్నికల్లో రఘునందన్‌రావు గెలుపొందడంతో మెదక్‌పై మళ్లీ పట్టు సాధించారు.



నాటి ఎమ్మెల్యే నేడు ఎంపీ... నేటి ఎమ్మెల్యే నాడు ఎంపీ

దుబ్బాక : దుబ్బాకలో విచిత్రమైన రాజకీయాలు చోటుచేసుకున్నాయి. మూడేళ్లు దుబ్బాక ఎమ్మెల్యేగా కొనసాగిన రఘునందన్‌రావు గత సార్వత్రిక ఎన్నికల్లో ఓడిన విషయం తెలిసిందే. అయితే, బీజేపీ నుంచి మెదక్‌పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి ప్రస్తుతం గెలుపొందారు. ఇదేస్థానం నుంచి పదేళ్లపాటు ఎంపీగా కొనసాగిన కొత్తప్రభాకర్‌రెడ్డి ప్రస్తుతం దుబ్బాక ఎమ్మెల్యేగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. యాదృచ్ఛికంగా కొత్త ప్రభాకర్ రెడ్డి స్థానంలో రఘునందన్‌రావు గెలుపొందడం గమనార్హం. ఒక అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఓడినప్పటికీ ఏడు అసెంబ్లీలకు ప్రతినిధిగా ఢిల్లీ బాట పట్టారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత స్వరాష్ట్రంలో జరిగిన మూడు ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గవాస్తవ్యులే మూడుసార్లు పార్లమెంట్ స్థానాలకు గెలుపొందడం విశేషం.

'హస్తానికి' జై కొట్టిన మల్లన్నసాగర్ భూనిర్వాసితులు

గజ్వేల్, జూన్ 4: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని మల్లన్నసాగర్ నిర్వాసితులు కాంగ్రెస్‌కు జైకొట్టారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచిన నిర్వాసితులు ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపు నిలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, స్థానిక నాయకులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు మల్లన్నసాగర్ భూనిర్వాసితులపై దృష్టిసారించి మొత్తంగా ఓట్లు రాబట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి 3,163 ఓట్లు రాగా, బీజేపీకి 1,976, బీఆర్‌ఎస్‌కు 2,584 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌పై భూనిర్వాసితులు తమ డిమాండ్లకు సంబంధించిన అల్టిమేటాన్ని ఓట్లతో అందజేసినట్లు అయింది.


గజ్వేల్ పట్టణంలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ



ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది


సిబ్బందికి సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

మాధవనేని రఘునందన్‌రావు

పుట్టిన తేదీ : 3-4-1965
స్వగ్రామం : బొప్పాపూర్ (దుబ్బాక మండలం)
తల్లిదండ్రులు : భారతి, భగవంతరావు
భార్య : మంజులాదేవి
కుమార్తె : సింధు
విద్యార్హత: బీఎస్సీ, బీఈడీ, ఎల్‌ఎల్‌బీ, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమన్‌రైట్స్
వృత్తి : న్యాయవాది

రాజకీయ నేపథ్యం : రఘునందన్‌రావు తొలినాళ్లల్లో జర్నలిస్టుగా, ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అనంతరం న్యాయవాది వృత్తిని కొనసాగించి అనేక కేసులను వాదించారు. 2001లో టీఆర్‌ఎస్ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్నారు. టీఆర్‌ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా కొనసాగారు. 2006లో దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2009లో ఎమ్మెల్సీగా పోటీచేసి ఓడిపోయారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్‌లో కీలకంగా పనిచేశారు. 2014లో టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం తొలగించి బయటకు పంపించడంతో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2014, 2018లో బీజేపీ తరఫున శాసనసభకు పోటీచేసి ఓడిపోయారు. 2019లో దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి మృతితో జరిగిన ఉపఎన్నికలో 1,100 పైచిలుకు ఓట్లతో టీఆర్‌ఎస్‌పై గెలుపొందారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి చేతిలో 54వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆరునెలల్లోనే మెదక్ లోక్‌సభ స్థానం నుంచి 34వేలకుపైగా ఓట్లతో గెలుపొందారు.



మెదక్ పార్లమెంట్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	రఘునందన్‌రావు (బీజేపీ)	నీలం మధు (కాంగ్రెస్)	వెంకట్రామారెడ్డి (బీఆర్‌ఎస్)	ఇతరులు	నోటా
	18,28,210	13,72,894	4,71,217	4,32,078	3,96,790	68,192	4,617

భువనగిరిలో 'చామల'.. కరీంనగర్‌లో 'బండి'

- 'హస్తానికి' జై కొట్టిన జనగామ సెగ్మెంట్
- కరీంనగర్ పార్లమెంట్‌లో బీజేపీ ఘనవిజయం

చేర్యాల, జూన్ 4: భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారు. సమీప బీజేపీ ప్రత్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై 2.22 లక్షల ఓట్లకు పైగా మెజారిటీ సాధించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓట్లను 23 రౌండ్లలో లెక్కించగా, చామల కిరణ్ కుమార్‌రెడ్డికి 6,23,762 ఓట్లు, బూర నర్సయ్యగౌడ్‌కు 4,01,513 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశంకు 2,54,838 ఓట్లు వచ్చాయి. చామలకు 2,22,249 ఓట్ల మెజారిటీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో బూర నర్సయ్యగౌడ్‌కు స్వల్ప ఆధిక్యం లభించింది. 13,142 పోస్టల్ బ్యాలెట్లకు బూర నర్సయ్యకు 5,460, కిరణ్‌కుమార్‌రెడ్డికి 5,381, మల్లేశ్‌కు 1,349 ఓట్లు వచ్చాయి.

జనగామ సెగ్మెంట్‌లో 31,235 మెజారిటీ

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జనగామ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ దక్కింది. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి జనగామ నియోజకవర్గ ఓటర్లు 31,235 ఓట్ల మెజారిటీ కట్టబెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 15వేలకు పైగా మెజారిటీ ఇచ్చిన ఓటర్లు.. పార్లమెంటు ఎన్నికలకు వచ్చేసరికి భిన్నంగా స్పందించారు. కాంగ్రెస్‌కు అంతకు రెట్టింపు మెజారిటీ ఇచ్చారు. జనగామ నియోజకవర్గంలో మొత్తంగా 1,81,302 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 76,032 ఓట్లు, క్యామ మల్లేశంకు 43,844 ఓట్లు, బూర నర్సయ్యకు 44,797 ఓట్లు పోలయ్యాయి.

హుస్నాబాద్‌లో పట్టు నిలుపుకున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్ : తన సొంత నియోజకవర్గమైన హుస్నాబాద్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టునిలుపుకున్నారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ 1, 7, 10, 11 రౌండ్లలో తప్ప మిగిలిన 18 రౌండ్లలో కాంగ్రెస్ తన ఆధిక్యత సాధించింది. వెలిచాల రాజేందర్‌రావుకు 79,001, బండి సంజయ్‌కి 55,873, బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు 41,298 ఓట్లు వచ్చాయి. రాజేందర్‌రావుకు 23,128 మెజారిటీ వచ్చింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ 19,344 ఓట్ల మెజారిటీతో విజయం సాధించగా ఈ ఎన్నికల్లో అసెంబ్లీ కంటే 3,784 ఓట్లు అధికంగా వచ్చాయి. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ తన నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత రావడంపై ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపొందగా హుస్నాబాద్ నియోజకవర్గంలో నాడు వినోద్‌కుమార్‌కు 66,885, పొన్నం ప్రభాకర్‌కు 44,123 ఓట్లు, బండి సంజయ్‌కి 43,144 ఓట్లు వచ్చాయి. ఈ సారి సంజయ్‌కి గతం ఎన్నికల కంటే 12,729 ఓట్లు అధికంగా వచ్చాయి. అప్పుడు మొదటి స్థానంలో ఉన్న బోయినిపల్లి వినోద్‌కుమార్ ఈసారి మూడవ స్థానానికి పరిమితమయ్యారు. బండి సంజయ్ గెలుపొందడం పట్ల నియోజకవర్గంలో కార్యకర్తలు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు.


రిటర్నింగ్ అధికారి నుంచి నియామకపత్రం అందుకుంటున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


కలెక్టర్ పమేలా సత్పతి నుంచి కరీంనగర్ ఎంపీగా నియామకపత్రం అందుకుంటున్న బండి సంజయ్

కేసీఆర్ కోటలో సగానికి తగ్గిన ఆధిక్యం

- గజ్వేల్‌లో పెరిగిన కాంగ్రెస్ బలం
- బీజేపీకి కోత

గజ్వేల్, జూన్ 4: మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలోని గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కారు జోరు.. బీజేపీ హోరు తగ్గాయి. కాంగ్రెస్ బలం అనూహ్యంగా పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీచేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు 1,12,244 ఓట్లు వచ్చాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీఆర్‌ఎస్‌కు 85,432 ఓట్లు వచ్చాయి. గతంతో పోల్చితే 27వేల ఓట్లు తగ్గాయి. అయినా, బీఆర్‌ఎస్‌కు జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పోల్చితే ఇక్కడే ఎక్కువ మెజారిటీ వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఆశించిన దాని కంటే మంచి ఆధిక్యమేనని గులాబీ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఈ సెగ్మెంట్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 32,322 ఓట్లు రాగా.. ఈసారి 65,539 ఓట్లు సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఇటీవల నియోజకవర్గ బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సెగ్మెంట్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 66,653 ఓట్లు రాగా.. ఈ ఎన్నికల్లో 56,811 ఓట్లు దక్కాయి. అసెంబ్లీ పోరులో ఈటల రాజేందర్ పోటీ చేయడంతో ముదిరాజ్ సామాజికవర్గం ఆయనకు అండగా నిలిచిందని అంతా భావించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు తగ్గిన బలం చాటుకోవడంతో అన్నివర్గాల ప్రజలు అండగా నిలిచారని చెప్పవచ్చు. మొత్తంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ రెట్టింపు కంటే ఎక్కువ పెరిగితే.. బీఆర్‌ఎస్ 27వేల ఓట్లను, బీజేపీ దాదాపు 10వేల ఓట్లను కోల్పోయింది.

ప్రజాసేవలో కొనసాగుతా

- మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు



పటాన్‌చెరు రూరల్, జూన్ 4 : ప్రజా తీర్పును గౌరవిస్తానని.. ప్రజాసేవలో ముందుంటానని మెదక్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ స్థానంలో తన ఓటమిపై ఆయన స్పందించారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర, రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రాణం పోశాయని అన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు మద్దతు పలికిన కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. భవిష్యత్తులో ప్రజల మధ్యే ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజల తీర్పును గౌరవిస్తున్నా..

- నాకు ఓటేసిన వారందరికీ కృతజ్ఞతలు
- మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డి



సిద్దిపేట టౌన్, జూన్ 4: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన ఓటమిని అంగీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీగా విజయం సాధించిన రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓడినా.. ప్రజల మధ్యలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. రాజకీయాలకు తాను కొత్త అయినా ఎంతో ప్రేమతో.. తనకు ఓటేసిన ఓటర్లకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. తనకు పోటీచేసే అవకాశం కల్పించిన మాజీ సీఎం కేసీఆర్‌కు, తన గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు కావడంతో జాతీయ పార్టీల ప్రభావంతో అనూహ్య ఫలితాలు వచ్చాయన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి గెలుపోటములు కొత్త కాదని.. 23 ఏళ్ల రాజకీయ ప్రజస్థానంలో ఎన్నో గెలుపోటములు చూసిందన్నారు. భవిష్యత్తులో మళ్లీ కోలుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

8న నిజాంపేటలో చేప ప్రసాదం పంపిణీ

నారాయణఖేడ్, జూన్ 4: మృగశిర కార్తెను పురస్కరించుకొని ఈ నెల 8న ఉదయం 7.30 గంటల నుంచి నిజాంపేట మండల కేంద్రంలో చేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తడకంటి పర్వాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శంకర్‌గౌడ్, లింగాగౌడ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 82 సంవత్సరాలుగా తమ పూర్వీకుల నుంచి ఈ చేప ప్రసాదాన్ని ఆనవాయితీగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. చేప ప్రసాదం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం ప్రజలు పెద్దసంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నారాయణఖేడ్‌లో పారిశుధ్యం పనులు

నారాయణఖేడ్, జూన్ 4: వర్షాలు కురుస్తుండడంతో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. పలు కాలనీలు, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, పెరిగిన పొదలతో పాటు మురుగు కాల్వల్లోంచి పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. మురుగు కాల్వలు, మినీ ట్యాంకుల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. స్పెషల్‌డ్రైవ్ పనులను శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నేటి నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్

● మూల్యాంకన విధుల్లో పాల్గొనని అధ్యాపకులపై చర్యలు

● జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్



సంగారెడ్డి అర్బన్, జూన్ 4: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. నేడు మొదటి స్పెల్‌లో భాగంగా సంస్కృతం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, పౌరశాస్త్రం, ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులు, 7వ తేదీన బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ సబ్జెక్టుల మూల్యాంకనం చేపట్టనున్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో విధులు కేటాయించబడిన అధ్యాపకులు తప్పకుండా మూల్యాంకన కేంద్రంలో సకాలంలో రిపోర్టు చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు. మూల్యాంకన విధుల్లో రిపోర్టు చేయని అధ్యాపకులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరుద్ర పురుగులు వచ్చేశాయ్..

అక్కన్నపేట, జూన్ 4: ఈ నెల 22న ఆరుద్ర కార్తె ప్రారంభం కానుంది. ఆరుద్ర కార్తెలో మాత్రమే కనబడే ఆరుద్ర పురుగులు కార్తె రాకముందే మంగళవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామలోని పంట పొలాల్లో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం రోహిణి కార్తె నడుస్తుండగా ఈ నెల 8న మృగశిర కార్తె రానుంది. తొలకరి వర్షాలు పడడంతో ఆరుద్ర కార్తె రాకముందే ఈ పురుగులు పంట పొలాల్లో కనిపించడం శుభసూచకమని, వర్షాలు బాగా పడుతాయని, పంట దిగుబడి కూడా అధికంగా వస్తుందని రైతుల నమ్మకం.



అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలోని పంట పొలాల్లో దర్శనమిచ్చిన ఆరుద్ర పురుగులు

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

● జహీరాబాద్ పార్లమెంట్‌లో సురేష్‌షెట్కార్ గెలుపుతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం

జహీరాబాద్, జూన్ 4: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రానున్నది. 2014 వరకు జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండగా.. 2014, 2018లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించడంతో కాంగ్రెస్ చతికిలపడింది. జహీరాబాద్ అసెంబ్లీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని నాయకులు ధీమాతో ఉన్నప్పటికి ఆ పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్ ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ కాంగ్రెస్ శ్రేణులు వెనుకడుగు వేయకుండా పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు చేసిన కృషి సురేష్‌కుమార్ షెట్కార్ గెలుపునకు దోహదపడింది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలుండగా మంగళవారం వెలువడిన ఫలితాల్లో అన్ని రౌండ్లలోనూ బీజేపీ, కాంగ్రెస్ మధ్యే గట్టిపోటీ ఏర్పడింది. జహీరాబాద్ ఎంపీగా సురేష్‌కుమార్‌షెట్కార్ విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంతోషం నెలకొంది. రాష్ట్ర ఫిలీం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్ కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్లి సురేష్‌కుమార్ షెట్కార్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

అందరి సహకారంతోనే విజయం సాధించా - సురేష్ షెట్కార్

జహీరాబాద్/నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీగా గెలుపొందిన సురేష్ కుమార్‌షెట్కార్ గీతం యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. అందరికి అందుబాటులో ఉంటూ, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలు మార్పును దృష్టిలో పెట్టుకుని సరైన తీర్పు ఇచ్చారని వివరించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శ్రమించడంతోనే అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు, ఆశీస్సులతో విజయం సాధించానని సురేష్ షెట్కార్ అన్నారు.

ఖేడ్‌లో సురేష్ షెట్కార్‌కు 20,262 ఓట్ల ఆధిక్యం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్‌కు 20,262 ఓట్ల ఆధిక్యత వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 1,72,508 ఓట్లు పోలవగా, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ కుమార్ షెట్కార్‌కు 78,280 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌కు 58,018 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు 28,194 ఓట్లు వచ్చాయి. నోటాకు 389 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థికి 20,860 ఓట్ల ఆధిక్యత లభించింది.



కౌంటింగ్ కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న సరేష్‌షెట్కార్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి

కట్టుదిట్టమైన భద్రత నడుమ ముగిసిన కౌంటింగ్

సంగారెడ్డి క్రైం/పటాన్‌చెరు రూరల్: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతంయూనివర్సిటీలో భద్రపరిచి, మంగళవారం ఓట్లను లెక్కించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలుగకుండా నియోజకవర్గాల వారీగా వేర్వేరుగా కౌంటర్లు, ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను గీతం పరిసరాలకు అనుమతించలేదు. కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేష్ దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికారులను, సిబ్బందిని ఎస్పీ రూపేష్ అభినందించారు.

రావి ఆకుపై 'సురేష్‌షెట్కార్'

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంట్ నుంచి నారాయణఖేడ్ పట్టణానికి చెందిన సురేష్ షెట్కార్ విజయం సాధించడంతో నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ సురేష్‌షెట్కార్ చిత్రపటాన్ని రావి ఆకుపై వేశారు.



టికెట్ త్యాగం చేసి.. ఎంపీగా విజయం

● తాత నారాయణఖేడ్ మొదటి ఎమ్మెల్యే



అప్పారావు షెట్కార్

నారాయణఖేడ్, జూన్ 4: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన సురేష్‌షెట్కార్ జహీరాబాద్ నియోజకవర్గానికి పార్లమెంట్ సభ్యుడు కాగా, ఆయన తాత, స్వాతంత్ర్య సమరయోధుడు అప్పారావుషెట్కార్ నారాయణఖేడ్ నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యే. సురేష్‌కుమార్ షెట్కార్ తాత అప్పారావు షెట్కార్‌తో పాటు ఆయన తండ్రి శివ్‌రావుషెట్కార్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. నిజాంపాలనకు వ్యతిరేకంగా భాష ప్రతిపాదికన రాష్ట్ర విభజన కోసం కూడా పోరాటాలు చేసి జైలు జీవితం గడిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన అనంతరం జరిగిన మొదటి ఎన్నికల్లో 1952లో అప్పారావు షెట్కార్ ఖేడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1957లోను ఎమ్మెల్యేగా గెలుపొందారు. సురేష్ కుమార్ షెట్కార్ తండ్రి శివ్‌రావుషెట్కార్ కూడా మూడుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. అనంతరం సురేష్ షెట్కార్ 2004లో ఎమ్మెల్యేగా, 2009లో నూతనంగా ఏర్పడిన జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నుంచి మొదటి ఎంపీగా గెలుపొందారు. 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ చేతిలో ఓటమి చెందారు. 2018లో ఖేడ్ శాసనసభకు పోటీ చేసి ఓడిపోయారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ వచ్చినప్పటికీ టికెట్‌ను త్యాగం చేయడంతో జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా మొదటి జాబితాలో సురేష్ షెట్కార్‌కు టికెట్ దక్కించుకుని, గెలుపొందారు.

ఎన్నికల ఫలితాల కోసం టీవీలకు అతుక్కుపోయిన జనాలు



ఖేడ్ మండలం నర్సాపూర్‌లో టీవీలో ఫలితాలను చూస్తున్న జనాలు

నారాయణఖేడ్, జూన్ 4: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపును మంగళవారం నిర్వహించడంతో ఎన్నికల ఫలితాల కోసం మారుమూల గ్రామాల్లో సైతం జనాలు ఆసక్తితో ఎదురు చూశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏడు వారాల పాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగడంతో, ఫలితాల కోసం జనాలు ఉత్కంఠతతో ఎదురు చూశారు. మంగళవారం ఉదయం నుంచి దేశంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగడంతో, ఎక్కడ నలుగురు చేరినా ఫలితాలపైనే చర్చించుకున్నారు. టీవీలకు అతుక్కుపోయి ఆసక్తితో ఫలితాలను తెలుసుకున్నారు. ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నంత సేపు ఫలితాల కోసం టీవీల ముందు జనాలు అతుక్కుపోయారు.

పవన్‌కల్యాణ్ అభిమానుల బైక్ ర్యాలీ

నారాయణఖేడ్, జూన్ 4: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి జయకేతనం ఎగురవేయడంతో పాటు పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విజయం సాధించడంపై ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో పవన్‌కల్యాణ్ అభిమానులు మంగళవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. పవన్ కల్యాణ్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు.



నారాయణఖేడ్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్ అభిమానులు

మెదక్‌లో సత్తా చాటని స్వతంత్రులు

మెదక్, జూన్ 4: మెదక్ లోక్‌సభ స్థానానికి భారీ సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మొత్తం 44 మంది నామినేషన్లు వేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు వచ్చింది. బీజేపీ నుంచి రఘునందన్‌రావు, కాంగ్రెస్ నుంచి నీలం మధు, బీఆర్‌ఎస్ నుంచి వెంకట్రామారెడ్డి నామినేషన్లు వేశారు. బీఎస్పీ అభ్యర్థిగా బాపట్ల ఈశ్వర్ ఎన్నికల బరిలో నిలిచారు. మిగిలిన 40 మంది స్వతంత్రులుగా పోటీ చేశారు. భారీ సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేయడంతో ఎన్నికల కమిషన్ పోలింగ్ బూత్‌లలో మూడేసి ఈవీఎంలను అమర్చింది. ఎన్నికల ఫలితాలను స్వతంత్రులు ప్రభావితం చేస్తారని విశ్లేషకులు భావించారు. కానీ మంగళవారం వెలువడిన ఫలితాల్లో వారికి వచ్చిన ఓట్లు నామమాత్రంగానే ఉన్నాయి. అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ పార్టీకి చెందిన తల్లాడ నంద కిషోర్‌కు 17,216 ఓట్లు రావడం విశేషం. ప్రజావెలుగు పార్టీ అభ్యర్థి సారా యాదగిరిగౌడ్‌కు 11,060 ఓట్లు వచ్చాయి. భారత్ జోడో పార్టీకి 2,132 ఓట్లు, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) పార్టీ అభ్యర్థి బండపల్లి శ్రీనివాస్‌కు 2,366 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి అడ్డ కుమార్‌కు 5,116 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన స్వతంత్రులకు నామమాత్రంగానే ఓట్లు పడ్డాయి.

ఇక విస్తరాకుల్లో భోజనం

● ప్లాస్టిక్ పేట్ల వాడకం ఆరోగ్యానికి హానికరం

● సిద్దిపేట జిల్లాలో అవగాహన సదస్సులు

● విస్తరాకుల తయారీపై అధికారుల అవగాహన

● ముందుకొస్తున్న మహిళా సంఘాల సభ్యులు



మోదుగు ఆకులతో విస్తరాకులను తయారు చేస్తున్న మహిళలు (ఫైల్)

సిద్దిపేట అర్బన్, జూన్ 4: ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగిపోతుండడంతో ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పు ముంచుకొస్తోంది. ప్రధానంగా నేడు ఎలాంటి దావత్‌లు అయినా భోజనాలకు ఎక్కువగా ప్లాస్టిక్ ప్లేట్స్ వాడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భోజన సమయంలో సహజ సిద్ధంగా లభించే మోదుగు ఆకులతో విస్తరాకులు తయారుచేసి దావత్‌లకు అందించేలా మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలను ఏర్పాటు చేసి, అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో పర్యావరణానికి మేలు చేసేదిలా ఉండడంతో పాటు ఉపాధి కూడా లభిస్తుండడంతో మహిళలు కూడా విస్తరాకుల తయారీకి ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే సిద్దిపేట కలెక్టరేట్‌లో అల్పాహార సమయంలో ప్లాస్టిక్ ప్లేట్స్‌ను నిషేధించి సహజ సిద్ధంగా తయారుచేసిన విస్తరాకులను వినియోగాస్తున్నారు.



కలెక్టర్‌కు మోదుగు ఇస్తరాకును అందజేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి దేవకి దేవి (ఫైల్)

ఆకులలో భోజనం ఎంతో మేలు

ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే మోదుగు ఆకులతో తయారుచేసిన విస్తరాకులు, పచ్చటి అరటాకులలో భోజనం చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. మోదుగ చెట్టు ఆకులతో తయారు చేసిన విస్తరాకులపై వేడి వేడి అన్నం, కూరలతో భోజనం చేస్తే జీర్ణక్రియ బాగా పనిచేస్తుందని చెబుతున్నారు. అదేవిధంగా క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తగ్గుతాయంటున్నారు.

విస్తరాకుల తయారీపై అవగాహన

సిద్దిపేట జిల్లా పరిధిలో 499 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 4 లక్షల మందికి పైగా ఉపాధి హామీ కూలీలు, 1.93 లక్షల మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. జిల్లా గ్రామపంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో విస్తరాకుల తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. స్వయంగా జిల్లా పంచాయతీ అధికారి దేవకి దేవి గ్రామాలను సందర్శించి మహిళలతో కలిసి విస్తరాకులు కుడుతూ అవగాహన కల్పిస్తున్నారు. పంచాయతీ శాఖ అధికారుల సూచనలు, సలహాలతో ప్లాస్టిక్‌ను తరిమి కొట్టేందుకు మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములవుతున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో మహిళలు, ఉపాధి హామీ కూలీలు విరివిగా పెరుగుతున్న మోదుగు ఆకులను తెంపుకొని వచ్చి ఎండబెట్టి విస్తరాకులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అన్ని గ్రామాల మహిళలు, ఉపాధి హామీ కూలీలు ముందుకు రావాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ రహితమే లక్ష్యం



ప్లాస్టిక్ రహితమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నాం. ప్లాస్టిక్ వస్తువులతో క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. పర్యావరణ హితం కోసం పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో వినూత్న ఆలోచన చేసి విస్తరాకుల తయారీకి నడుం బిగించాం. ఈ కార్యక్రమానికి మహిళల నుంచి మంచి స్పందన వస్తున్నది. విస్తరాకుల తయారీ ద్వారా మహిళలకు ఉపాధి సైతం లభిస్తుంది. వేడుక ఏదైనా విస్తరాకులను వినియోగించేలా చర్యలు చేపడుతున్నాం. మళ్లీ పాతకాలం నాటి రోజులు రావాలని ఆశిస్తున్నాం.

- దేవకిదేవి, జిల్లా పంచాయతీ అధికారి, సిద్దిపేట

ఉపాధితో పాటు ఆరోగ్యం

ప్లాస్టిక్ విస్తరాకులలో భోజనం చేయడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని తెలుసుకున్నాం. విస్తరాకులు వాడాలని అధికారులు అవగాహన కల్పించడంతో విస్తరాకుల తయారీపై దృష్టి పెట్టాం. ప్రజారోగ్యంలో మేమూ భాగస్వాములమై సహజసిద్ధంగా లభించే ఆకులతో విస్తరాకులు తయారు చేస్తున్నాం. ఉపాధితో పాటు ఆరోగ్యాన్ని అందించే కార్యక్రమంలో భాగస్వాములవడం సంతోషంగా ఉంది.

- లక్ష్మి, ఎన్సాన్‌పల్లి

కమల దళం ఖుష్

● మెదక్ పార్లమెంట్ సీటు బీజేపీ కైవసం
● బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్న కార్యకర్తలు, నాయకులు

వర్గల్, జూన్ 4: మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించడంతో, మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాసులు కల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో దిండి నాగరాజు, బద్రినాథ్, యశ్వంత్‌రెడ్డి, యతీష్‌కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** బీజేపీ మెదక్‌పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించడంతో దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండల కేంద్రాల్లో టాపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవరాజు, మల్లేశం, రోశయ్య, కరుణాకర్, ఐలయ్య ఉన్నారు.

● **సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట:** రఘునందన్‌రావు గెలుపొందడంతో సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్, జిల్లా నాయకులు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణరావుపేట మండల అధ్యక్షుడు పొన్నాల బాబు తదితరులు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు విజయం సాధించిన సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బాంబులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

● **రాయపోల్:** మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రఘునందర్‌రావు గెలుపొందడంతో రాయపోల్‌తో పాటు గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీకి ఓటు వేసిన వారందరికీ పార్టీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్, ప్రధాన కార్యదర్శి నీల స్వామి ధన్యవాదాలు తెలిపారు.

● **గజ్వేల్:** మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందడంతో గజ్వేల్ పట్టణంలోని శివాజీ విగ్రహం, అంబేడ్కర్ విగ్రహం వద్ద, ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నాయిని సందీప్‌కుమార్, సందీప్‌కుమార్, మర్కంటి ఎగొండల ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. వారితో బీజేపీ నాయకులు ఉన్నారు.

● **ములుగు:** మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించడంతో సీనియర్ నాయకుడు పెంటయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు.


దుబ్బాక/మిరుదొడ్డి: మిరుదొడ్డిలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు


ములుగు: టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు


సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట: స్వీట్లు పంచి సంబరాలు చేసుకుంటున్న నాయకులు


కుకునూరుపల్లి: మండల కేంద్రంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు


గజ్వేల్: శివాజీ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

డంపింగ్‌యార్డును పరిశీలించిన రీజనల్ డైరెక్టర్


డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న రీజనల్ డైరెక్టర్, తదితరులు

గజ్వేల్, జూన్ 4: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును వరంగల్ రెంజ్ రీజనల్ డైరెక్టర్ షాహేద్ మసూద్ మంగళవారం పరిశీలించారు. డంపింగ్ యార్డులో చేపడుతున్న బయోమైనింగ్‌లో జరిగే రీసైక్లింగ్ చేయు పొడి వనరులను, కంపోస్టు ఎరువులను ఆయన పరిశీలించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, ఏఈ కిష్టన్న, ఇంచార్జీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జూన్ 4: గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న గజ్వేల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ బోధించడానికి గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత సబ్జెక్టుల్లో ఎస్సీ ఎస్టీలు అయితే 50శాతం, బీసీ, ఓసీలు అయితే 55శాతంతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే నెట్, సెట్ పాసైన వారికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 7న ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధృవీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్సు కాపీతో హాజరుకావాలని సూచించారు.

టీడీపీ అభిమానుల సంబరాలు

వర్గల్, జూన్ 4: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం పట్ల మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో మాజీ సీఎం నార చంద్రబాబునాయుడి అభిమానులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ అభిమానులు టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రవీన్‌గౌడ్, నవీన్‌గుప్తా, భరత్‌రెడ్డి, మక్తాల శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గౌతంరాజ్, ఫయాజ్, కిషన్, నర్సింహులు తదితరులు ఉన్నారు.


వర్గల్: మండల కేంద్రంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం


సిద్దిపేట అర్బన్: సంబరాలు జరుపుకుంటున్న తెలుగుదేశం శ్రేణులు

● **సిద్దిపేట అర్బన్:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించడంతో సిద్దిపేటలో టీఎన్ఎస్ఎఫ్, టీడీపీ శ్రేణులు అంబేడ్కర్ విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జాతీయ సమన్వయ కమిటీ మాజీ సభ్యుడు తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ ఘనవిజయం సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల గెలుపు సంబరాలు

చేర్యాల, జూన్ 4: కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడంతో కాంగ్రెస్ నాయకులు మంగళవారం చేర్యాలలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండు వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్పాటకం దుర్గారెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ముస్త్యాల తారయాదగిరి, పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు కొమ్ము నర్సింగరావు, తాటికొండ సదానందం, అందె అశోక్, పుర్మ ఆగంరెడ్డి, ఆడెపు చంద్రయ్య, కాటం మల్లేశం, ముస్త్యాల యాదగిరి, దాసరి శ్రీకాంత్, కాటం శ్రీను, బందెల మహిపాల్‌రెడ్డి, పోతురాజు, జహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


చేర్యాలలో: బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

● **దూళిమిట్ట:** భువనగిరి పార్లమెంట్ ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపొందడంతో దూళిమిట్ట మండల కేంద్రంలో కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


దూళిమిట్ట: పటాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

● **మద్దూరు:** భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో మండలంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం సొసైటీ మాజీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు షౌకత్‌అలీ, ముంతాజ్‌హుస్సేన్ ఫసీయొద్దీన్, కాటం బాలయ్య, కొమురవెల్లి దేవస్థాన కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, బూర్గు శంకర్‌తో పాటు పలువురు ఉన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి


జైపాల్ మృతదేహం

పెద్దశంకరంపేట,జూన్ 4: పిడుగుపాటుతో యువకుడితో పాటు మూడు మేకలు మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని బూర్గుపల్లి, చందానాయక్‌తండాలో జరిగింది. తండాకు చెందిన మూడావత్ జైపాల్(25) మేకలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సైతం మేకలను మేతకోసం తీసుకెళ్లగా.. ఒక్కసారిగి పిడుగుపడడంతో జైపాల్‌తో పాటు మూడు మేకలు మృతిచెందాయని స్థానికులు తెలిపారు. జైపాల్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ప్రసుతం గర్భిణి అని తండావాసులు పేర్కొన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని గ్రామస్థులు, కుటుంబీకులు కోరారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..


పవన్ కల్యాణ్ (ఫైల్)

చిన్నశంకరంపేట, జూన్ 4: మద్యానికి బానిసై.. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామానికి చెందిన బూపాల పవన్ కల్యాణ్(19) కూలీ పనులు చేస్తూ, గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కుటుంబ పోషణ భారం కావడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గతనెల 11న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఝరాసంగంలో మోస్తరు వర్షం

ఝరాసంగం, జూన్ 4: మండలంలోని తుమ్మన్‌పల్లి, కప్పాడ్, గంగాపూర్ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. వాతరణం ఒకేసారి చల్లాబడడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. ఈ గ్రామాల్లోని రైతులు ముందుగానే పత్తి విత్తనాలను విత్తడంతో వర్షం కురవడం వల్ల సంతోషం వ్యక్తం చేశారు.

కొల్చారం మండలంలో పెరిగిన బీజేపీ బలం

కొల్చారం, జూన్ 4: కొల్చారం మండలంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బలం అనూహ్యంగా పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ 841 ఓట్ల మెజార్టీ సాధించగా, బీజేపీ మూడోస్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచింది. మంగళవారం వెలువడిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 7,849 ఓట్లతో మొదటిస్థానంలో నిలువగా, 6,971 ఓట్లతో బీజేపీ రెండోస్థానంలో ఉంది. 5,849 ఓట్లతో బీఆర్ఎస్ మూడోస్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

కొనసాగుతున్న చోకమేళ మహోత్సవాలు

నారాయణఖేడ్, జూన్ 4: నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ మందిరంలో సోమవారం నుంచి ప్రారంభమైన చోకమేళ ఉత్సవాలు మంగళవారం రెండోరోజూ కొనసాగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కీర్తనలు, నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఈనెల 5న దిండియాత్ర, శోభాయాత్ర నిర్వహించనున్నారు. అంబాదాస్‌మహరాజ్‌చే కీర్తన ఉంటుందన్నారు.

చెలిమి ఫౌండేషన్ సహాయం

రాయపోల్, జూన్ 4: రాయపోల్‌కు చెందిన బ్యాగరి నవీన్‌కుమార్ ఆర్టీసీలో తాత్కాలిక డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 8 నెలల క్రితం అతడికి యాక్సీడెంట్ జరిగి నడుము విరిగి మంచానికి పరిమితం అయ్యాడు. వీరిది పేద కుటుంబం. విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు మంగళవారం బాధిత కుటుంబానికి రూ. 3500ల నిత్యావసర సరుకులు, రూ. 11,500లు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తులసీదాస్, ఆనంద్, భగవంత్, నర్సింహులు, రమేష్, శ్రీనివాస్, సంతోష్, అంజనేయులు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


నవీన్‌కుమార్‌కు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న దృశ్యం

మంత్రి 'పొన్నం' పరామర్శ


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 4: హుస్నాబాద్ పట్టణంలో ఇటీవల మృతిచెందిన పలువురి కుంటుంబాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల వడదెబ్బతో మృతిచెందిన హమాలీ కార్మికుడు ఉల్లెంగుల సంపత్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు లకావత్ రామన్ననాయక్‌ల కుటుంబాలను పరామర్శించారు. సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన బత్తిని రామస్వామిగౌడ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, నాయకులు సంజీవరెడ్డి, ఎండీ హసన్, జేఏసీ నాయకులు మేకల వీరన్న యాదవ్ తదితరులున్నారు.

బైక్ అదుపుతప్పి బావిలో పడ్డ వ్యక్తి

● రక్షించిన గ్రామస్థులు
● నీరు లేకపోవడంతో తప్పిన ప్రమాదం


బావిలోపడ్డ వ్యక్తిని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

మద్దూరు, జూన్ 4: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి బావిలోపడ్డ వ్యక్తిని వల్లంపట్ల గ్రామస్థులు కాపాడారు. దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన వెంకటేష్ సోమవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో బైరాన్‌పల్లి నుంచి మద్దూరు మండలం గాగిళ్లాపూర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. వల్లంపట్ల గ్రామ శివారు పెట్రోల్ పంపు సమీపంలో అదుపుతప్పి నీరులేని బావిలోపడ్డాడు. బైక్ చెట్టుకొమ్మకు చెక్కి వేలాడుతూ, లైట్ వెలుగుతుండడంతో అటుగా వెళ్తున్న రైతులు గమనించి గ్రామస్థులకు సమాచారం అందించారు. కొంతమందితో అక్కడికి చేరుకున్న సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి బావిలో పడ్డ వెంకటేష్‌ను శ్రమించి బయటకు తీశాడు. అతడిని చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు సిద్దిపేట ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించినట్లు సమాచారం.

'సహకార బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలి'

కొండపాక, జూన్ 4: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డీసీసీబీ దుద్దెడ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ హీన అఫ్రీన్ తెలిపారు. డీసీసీబీ బ్యాంక్ దుద్దెడ బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం జూన్ మాసంలో ఇంటింటికీ డీసీసీబీ, సహకార బచ్ పన్ భరోసా, డిపాజిట్ పథకం స్కీంలో చేరండి, లక్షధికారి అవ్వండి పథకాలకి సంబంధించిన గోడపత్రికలను ఖాతాదారులతో కలిసి ఆవిష్కరించారు. సహకార బచ్ పన్ భరోసా డిపాజిట్ పథకం కింద 10సం లోపు చిన్నారుల పేరిట డిపాజిట్ చేస్తే 9 సంవత్సరాలలోపు రెట్టింపు రాబడిని పొందగలరని తెలిపారు. డీసీసీబీ బ్యాంక్‌లో ఆర్‌డీ ద్వారా ప్రతి నెల రూ.600 పొదుపు చేయడంతో లక్షధికారి కావచ్చని అన్నారు. జూన్ నెలలో ఖాతా తెరిచిన, డిపాజిట్ చేసిన ప్రతి ఒక్కరికీ బ్యాంక్ తరపున ఉచిత బీమా సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది క్రాంతికుమార్, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● డీఆర్‌డీవో అదనపు పీడీ జయదేవ్ ఆర్య


కార్యక్రమంలో మాట్లాడుతున్న జయదేవ్ ఆర్య

హుస్నాబాద్ రూరల్, జూన్ 4: సమాజంలో మహిళలు ముందుండి అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌డీవో అదనపు పీడీ జయదేవ్ ఆర్య పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని టీటీసీ భవన్‌లో మహిళలకు 30 రోజుల మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ పొందిన మహిళలకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పోతారం(ఎస్)లో స్వశక్తి మహిళలు కుడుతున్న స్కూల్ యూనిఫామ్స్‌ను పరిశీలించారు. ఇందులో అదనపు డీఆర్‌డీవో బాలకిషన్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెబాట పట్టిన పారిశుధ్య కార్మికులు

● నాలుగు రోజులుగా నిలిచిపోయిన పనులు

అల్లాదుర్గం, జూన్ 4: తమకు ఐదునెలలుగా వేతనాలు రావడం లేదంటూ అల్లాదుర్గం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టారు. ఈ నెల 1 నుంచి కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో పట్టణంలోని ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుందని, దీంతో దుర్గంధం వ్యాపిస్తూ దోమలు సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు. తమ వేతనాల గురించి సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కార్మికులు వాపోతున్నారు. వేతనాలు రాకపోవడంతో తాము చేసేదేమి లేక ఈ పనులు మానివేసినట్లు కార్మికులు తెలియజేస్తున్నారు.


అల్లాదుర్గంలోని మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

● వివిధ అంశాలపై కెడెట్లకు శిక్షణ


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నసురేశ్‌కుమార్

గజ్వేల్, జూన్ 4: గజ్వేల్ పట్టణంలోని బాలుర డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ శిక్షణ శిబిరం నాలుగో రోజు కొనసాగింది. ఈ శిక్షణ శిబిరంలో భాగంగా గజ్వేల్ అగ్నిమాపక అధికారి సురేశ్ కుమార్ కెడెట్లకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రత్యేక్ష పరిశీలన ద్వారా వివరించారు. మహిళా కెడెట్లకు వైద్యురాలు పద్మజ్యోతి రుతుక్రమంపై అవగాహన కల్పించి, నెలసరి సమయంలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారా మార్గాల గురించి వివరించారు. రాజగోపాల్‌పేట ఫైరింగ్ రేంజ్ వద్ద ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ యాదగిరి కెడెట్లకు శిక్షణ ఇచ్చారు. సిమ్యూలేటర్ ఫైరింగ్ ద్వారా కెడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు క్యాంపు డిప్యూటీ కామాండెంట్ కెప్టెన్ భవాని తెలిపారు.

వొక్సాన్ యూనివర్సిటీ గార్డెన్ వర్కర్ అదృశ్యం

మునిపల్లి, జూన్ 4: గార్డెన్ వర్కర్ అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన సంగమేశ్వర్.. మండల పరిధిలోని కంకోల్‌లో నివాసముంటూ గ్రామ శివారులో గల వొక్సాన్ యూనివర్సిటీలో నాలుగేళ్లుగా గార్డెన్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం నైట్ డ్యూటీకి వెళ్లిన సంగమేశ్వర్ అర్ధరాత్రి 3 గంటల వరకు పనిచేసి అదృశ్యమయ్యాడు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సంగమేశ్వర్ కుటుంబసభ్యులు, బంధువులు యూనివర్సిటీ గేటు ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. యూనివర్సిటీ యాజమాన్యం పొంతన లేని సమాధానం చెప్పడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంగమేశ్వర్ కుటుంబాన్ని సముదాయించారు. సంగమేశ్వర్ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.


వొక్సాన్ యూనివర్సిటీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న సంగమేశ్వర్ కుటుంబ సభ్యులు

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

● రూ.3 లక్షల నష్టం, ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


మృతిచెందిన గేదెలు

గుమ్మడిదల, జూన్ 4: విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతిచెందాయి. గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన పాదాల కృష్ణ అనే రైతు తనకున్న మూడు గేదెలను మంగళవారం ఉదయం కేవీ33 /11 ఉప విద్యుత్ కేంద్రం గుమ్మడిదల వెనుక ప్రాంతంలోని పొలం వద్ద వదిలిపెట్టాడు. అయితే గాలి దుమారానికి విద్యుత్ వైర్లు తెగిపడి ప్రమాదవశాత్తు గేదెలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏడీ శ్రీకాంత్, ఏఈ రవీందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా గేదెలు మృతిచెందడంతో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని, తమ జీవనాధారం కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని విద్యుత్ అధికారులు హామీఇచ్చారు. కాగా మండల పశు వైద్యాధికారి చైతన్య పర్యవేక్షణలో మృతిచెందిన గేదెలకు పంచనామా నిర్వహించారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా అధికారి జనార్దన్


108 వాహనాన్నితనిఖీ చేస్తున్న జిల్లా అధికారి జనార్దన్

పెద్దశంకరంపేట, జూన్ 4: మెదక్ జిల్లాలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న 108/102 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా 108/102 ప్రోగ్రాం అధికారి జనార్దన్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే 108 సిబ్బంది స్పందించాలని వారికి సూచించారు. గర్భిణులు, బాలింతలు కోసం 102 వాహనాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎంఈ అధికారి మహేష్, పైలేట్ రమేష్, ఏఎంటి సంగమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

కడ్పల్ పీఏసీఎస్ చైర్మన్ జలీల్ కన్నుమూత

కల్హేర్, జూన్ 4: సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ.జలీల్ (59) అనారోగ్యంతో మంగళవారం మరణించాడు. సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన జలీల్ వారంరోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికాగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించి మృతిచెందినట్లు నాయకులు తెలిపారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, సిర్గాపూర్ ఎంపీటీసీ పీరప్ప, సీనియర్ నాయకులు యాదవరెడ్డి, మహేశ్వర్‌గుప్తా సిర్గాపూర్‌లోని జలీల్ స్వగృహంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.